# ఆకాశవాణి, ప్రాంతీయ వార్తా విభాగం

# విశాఖపట్నం కేంద్రం

# జాతీయ వార్తలు

తేదీ: 30-11-2024 సమయం : రాత్రి 8 గం. 30 ని. లు

## ముఖ్యాంశాలు

- ❖ భారత ఆర్థిక సుస్థిరతను అంతర్జాతీయ సంస్థలు ప్రశంసిస్తున్నాయని ఉపరాష్ట్రపతి జగదీప్ ధన్‌ఖడ్ పేర్కొన్నారు.
- ❖ ఉత్తర బీహార్ అభివృద్ధికి ఎన్డీయే ప్రభుత్వం కట్టుబడి ఉందని కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ తెలిపారు.
- ❖ గుజరాత్‌లోని సూరత్ సమీపంలో జరుగుతున్న ముంబై-అహ్మదాబాద్ బుల్లెట్ రైలు ప్రాజెక్ట్ పనులను రైల్వే శాఖ మంత్రి అశ్విని వైష్ణవ్ ఈ రోజు పరిశీలించారు.
- ❖ ఫెంగల్ తుపాను ప్రభావంతో తమిళనాడు, దక్షిణ ఆంధ్రలోని పలు జిల్లాల్లో భారీ వర్షాలు కురుస్తున్నాయని భారత వాతావరణ శాఖ వెల్లడించింది.

= = = = = = = = = = = = = = = = = = = = =

భారత ఆర్థిక సుస్థిరతను అంతర్జాతీయ ఆర్థిక సంస్థలు ప్రశంసిస్తున్నాయని ఉపరాష్ట్రపతి జగదీప్ ధన్‌ఖడ్ అన్నారు. ఈ రోజు న్యూఢిల్లీలో డెవలప్ ఇండియా 2047, విజన్ ఆఫ్ న్యూ ఇండియా 3.0 పేరుతో జరిగిన సదస్సులో మాట్లాడుతూ... అభివృద్ధి చెందిన భారతదేశం ఇకపై కల కాదని, సవాలుతో కూడిన లక్ష్యమని, దేశం తన సంకల్పంతో ఈ లక్ష్యాన్ని సాధిస్తుందని ఉద్ఘాటించారు. పెట్టుబడులు, అవకాశాలకు భారతదేశం గమ్యస్థానమని ఐ.ఎం.ఎఫ్ తెలిపిందని ఆయన అన్నారు. సాధ్యమైనంత తక్కువ సమయంలో 50 కోట్ల మందికి పైగా ప్రజలు బ్యాంకింగ్ వ్యవస్థకు అనుసంధానించబడ్డారని చెప్పారు. అలాగే “వోకల్ ఫర్ లోకల్”లో భాగంగా ప్రజలు తమ అవసరాలకు అనుగుణంగా వనరులను ఉపయోగించుకోవాలని కోరుతూ...

(వాయిస్ 32 సెకన్లు)

= = = = = = = = = = = = = = = = = = = = =

సెంట్రల్ బోర్డ్ ఆఫ్ ట్రస్టీస్ ఈ రోజు న్యూఢిల్లీలో 236వ సమావేశానికి కేంద్ర కార్మిక ఉపాధి శాఖ మంత్రి డాక్టర్ మన్సుఖ్ మాండవియా అధ్యక్షత వహించారు. ఈ సమావేశంలో, ఎంప్లాయీ పెన్షన్ స్కీమ్  విరాళాల కేంద్రీకృత సేకరణ కోసం బ్యాంకుల జాబితాలో ప్రమాణాలను సరళీకృతం చేసే ప్రతిపాదనను బోర్డు ఆమోదించింది. "ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్", ఈజ్ ఆఫ్ ప్రొవైడింగ్ సర్వీస్ రెండింటినీ మెరుగుపరుస్తుంది.

= = = = = = = = = = = = = = = = = = = = =

గుజరాత్‌లోని సూరత్ సమీపంలో ముంబై-అహ్మదాబాద్ బుల్లెట్ రైలు ప్రాజెక్ట్ కోసం ట్రాక్ స్లాబ్ తయారీ కర్మాగారాన్ని రైల్వే మంత్రి అశ్విని వైష్ణవ్ ఈ రోజు పరిశీలించారు. ఈ కర్మాగారంలోని అన్ని పరికరాలను జపాన్ నుండి తెప్పించామని, ఇది రాబోయే నిర్మాణ ప్రాజెక్టులకు ప్రయోజనకరంగా ఉంటుందని కేంద్రమంత్రి చెప్పారు. కిమ్‌లోని ఈ కర్మాగారం ప్రపంచంలోని అతిపెద్ద ట్రాక్ స్లాబ్ పరిశ్రమలలో ఒకటని అశ్వినీ వైష్ణవ్ పేర్కొంటూ....

(వాయిస్ 37 సెకన్లు)

= = = = = = = = = = = = = = = = = = = = =

మహారాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల ఓటింగ్ శాతంపై కాంగ్రెస్ అనుమానాలను నివృత్తి చేసేందుకు ఆ పార్టీ ప్రతినిధి బృందాన్ని డిసెంబర్ 3న తమను కలవాలని ఎన్నికల కమిషన్ ఆహ్వానించింది. ప్రతి దశలోనూ ఎన్నికలు పారదర్శకంగా జరిగాయని ఈసీ పేర్కొంది. హర్యానా అసెంబ్లీ ఎన్నికల తర్వాత ఈవీఎంల ప్రక్రియపై కూడా కాంగ్రెస్ సందేహాలను వ్యక్తం చేసింది.

= = = = = = = = = = = = = = = = = = = = =

మహారాష్ట్ర రాష్ట్ర ముఖ్యమంత్రి ప్రమాణ స్వీకారం డిసెంబర్ 5న జరగనుందని భారతీయ జనతా పార్టీ వెల్లడించింది. ముంబయిలోని ఆజాద్ మైదానంలో ముఖ్యమంత్రితో పాటు పలువురు మంత్రులు ప్రమాణం చేయనున్నారు. ప్రధానమంత్రి నరేంద్రమోదీ  ఈ కార్యక్రమానికి హాజరుకానున్నారని బీజేపీ రాష్ట్ర అధ్యక్షులు చంద్రశేఖర్ సామాజిక మాధ్యమం వేదికగా తెలియజేశారు.

విరామం

= = = = = = = = = = = = = = = = = = = = =

ఉత్తర బీహార్ అభివృద్ధికి NDA ప్రభుత్వం కట్టుబడి ఉందని కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ పేర్కొన్నారు. మధుబని జిల్లాలోని ఝంఝర్‌పూర్‌లో జరిగిన క్రెడిట్ ఔట్‌రీచ్ కార్యక్రమంలో కేంద్రమంత్రి ఈరోజు 50 వేల మందికి పైగా లబ్ధిదారులకు 1,121 కోట్ల రూపాయల విలువైన మంజూరు లేఖలు, రుణాలను అందజేశారు. వివిధ లబ్ధిదారులకు PM స్వానిధి, PM విశ్వకర్మ, ముద్ర, స్టాండ్ అప్ ఇండియా, కిసాన్ క్రెడిట్ కార్డ్ పథకాల కింద రుణాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, బడ్జెట్‌లో వరదల నివారణా కేటాయింపులకు కేంద్రం కృషి చేస్తోందని పేర్కొన్నారు. 2047 నాటికి అభివృద్ధి చెందిన భారతదేశ మైలురాయిని చేరుకునే దిశగా మహిళలు ప్రయత్నిస్తున్నారని అన్నారు. ఈ సందర్భంగా ఆమె స్వయం సహాయక బృందాల మహిళా సభ్యులతో ప్రత్యేకంగా చర్చలు జరిపారు.

(వాయిస్ 35 సెకన్లు)

= = = = = = = = = = = = = = = = = = = = =

మహాబలిపురం-కరైకల్ మధ్య పుదుచ్చేరి సమీపంలో ఫెంగల్ తుపాను తీరం దాటే ప్రక్రియ ప్రారంభమైందని భారత వాతావరణ శాఖ వెల్లడించింది. ఈ ప్రక్రియ దాదాపు 4 గంటలు పట్టే అవకాశముందని ఐఎండీ అంచనా వేసింది. తుపాను

ప్రభావంతో తమిళనాడు, పుదుచ్చేరి, దక్షిణ కోస్తాంధ్ర, రాయలసీమ జిల్లాల్లో భారీ వర్షాలు కురుస్తున్నాయి. కోస్తాంధ్రలో చాలా చోట్ల తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు నమోదయ్యాయి. తుపాను తీరం దాటే సమయంలో 70 నుంచి 80 కి.మీ వేగంతో ఈదురుగాలులు వీచే అవకాశముందని వాతావరణ శాఖ తెలియజేసింది.

= = = = = = = = = = = = = = = = = = = = =

భారతదేశాన్ని అభివృద్ధి చెందిన దేశంగా తీర్చిదిద్దుతామని లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లా అన్నారు. ఈ రోజు ఫరీదాబాద్‌లో జరిగిన ఒక కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ... ప్రపంచ సవాళ్లను పరిష్కరించడంలో భారతదేశం ప్రధాన శక్తిగా అవతరించిందన్నారు. ప్రపంచంలోనే ఇప్పుడు దేశానికి అపురూపమైన గుర్తింపు ఉందని వ్యాఖ్యానించారు. 21వ శతాబ్దంలో దేశం ప్రతి రంగంలోనూ సరికొత్త రికార్డులను నెలకొల్పడం ప్రజాస్వామ్య బలమని పేర్కొన్నారు. అలాగే దేశ నిర్మాణానికి యువత తమ వంతు సహకరిస్తామని ప్రతిజ్ఞ చేయాలని పిలుపునిచ్చారు. భారతీయులు విద్య, వైద్యం, ఐటీ, ఆటో మొబైల్స్‌తో సహా అన్ని రంగాల్లోనూ ఉన్నత స్థానంలో నిలుస్తున్నారని స్పీకర్ పేర్కొన్నారు.

= = = = = = = = = = = = = = = = = = = = =

లక్నో లో జరుగుతున్న సయ్యద్ మోడీ ఇంటర్నేషనల్ బ్యాట్‌మెంటన్ టోర్నమెంట్ లో భాగంగా ఈరోజు జరిగిన పురుషుల సింగిల్స్ సెమీ ఫైనల్ మ్యాచ్ లో భారత క్రీడాకారుడు లక్ష్యసేన్ విజయం సాధించి ఫైనల్‌కు చేరుకున్నాడు. అలాగే మహిళా క్రీడాకారిణి పీవీ సింధూ ప్రత్యర్థి ఉన్నతీ హుడాపై విజయం సాధించి ఫైనల్‌కు అర్హత సాధించింది. మరోవైపు యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ (యూఏఈ)లో జరుగుతున్న అండర్ 19 ఆసియా కప్ క్రికెట్ టోర్నమెంట్ లో భాగంగా ఈరోజు దుబాయ్ ఇంటర్నేషనల్ స్టేడియం వేదికగా జరిగిన వన్‌డే మ్యాచ్ లో భారత జట్టుపై పాకిస్థాన్ జట్టు 43 పరుగుల తేడాతో విజయం సాధించింది.

= = = = = = = = = = = = = = = = = = = = =

భారత సాయుధ దళాలు, సింగపూర్ సాయుధ దళాల మధ్య ఈనెల 28న ప్రారంభమైన ద్వైపాక్షిక మిలిటరీ విన్యాసం అగ్ని వారియర్ 2024 మహారాష్ట్రలోని దేవ్‌లాలీలో ఈ రోజు ముగిసింది. ఈ ద్వైపాక్షిక విన్యాసాల్లో సింగపూర్ ఆర్టిలరీకి చెందిన 182 మంది సిబ్బంది, దేశ ఆర్మీ రెజిమెంట్ ఆఫ్ ఆర్టిలరీకి చెందిన 114 మంది సిబ్బంది పాల్గొన్నారు.

= = = = = = = = = = = = = = = = = = = = =

రక్షణ మంత్రిత్వ శాఖ ఈ రోజు కొచ్చిన్ షిప్‌యార్డ్ లిమిటెడ్‌తో ఐ.ఎన్.ఎస్. విక్రమాదిత్య షార్ట్ రీఫిట్, డ్రై డాకింగ్ కోసం మొత్తం 1,200 కోట్ల రూపాయల వ్యయంతో ఒప్పందం కుదుర్చుకుంది. భారతదేశ పారిశ్రామిక పర్యావరణ వ్యవస్థకు మద్దతుగా కొచ్చిన్ షిప్‌యార్డ్ లిమిటెడ్‌ను నిర్వహణ, మరమ్మత్తుల హబ్‌గా అభివృద్ధి చేయడానికి ఈ ప్రాజెక్ట్ ముందడుగు వేసిందని రక్షణ మంత్రిత్వ శాఖ వెల్లడించింది.

= = = = = = = = = = = = = = = = = = = = =

అష్టలక్ష్మి మహోత్సవ్-2024ను వచ్చే నెల 6వ తేదీన న్యూఢిల్లీలోని భారత్ మండపంలో ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ప్రారంభించనున్నారు. మూడు రోజుల పాటు జరిగే పాటు ఈ ఉత్సవంలో 8 ఈశాన్య రాష్ట్రాలైన - అరుణాచల్ ప్రదేశ్, అస్సాం, మణిపూర్, మేఘాలయ, మిజోరం, నాగాలాండ్, త్రిపుర, సిక్కిం రాష్ట్రాలు పాల్గొంటాయి. ఈ ప్రాంతంలోని 320 మంది రైతులు, అలాగే చేతివృత్తుల వారి ఉత్పత్తులు, కళలను ఈ ఉత్సవంలో ప్రదర్శించనున్నారు.

= = = = = = = = = = = = = = = = = = = = =
= = = = = = = = = = = = = = = = = = = = =